క్లుప్తంగా

ఏడుగురిపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటకు చెందిన సవలాపురపు కామయ్య ఫిర్యాదు మేరకు ఏడుగురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వి.సందీప్ కుమార్ చెప్పారు. ఏడుగురు వ్యక్తులు మద్యం మత్తులో తన ఇంటి సమీపంలో మంగళవారం అర్ధరాత్రి గొడవ చేస్తుండగా, ప్రశ్నించడంతో తనపై వంశీ అనే వ్యక్తితోపాటు మరో ఆరుగురు దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం క్షతగాత్రుడు శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. మరోపక్క ప్రత్యర్థులు సైతం కౌంటర్ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును పరిశీలిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

కామాక్షికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కామాక్షి అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాండ్రంగి వీధిలో వేంచేసిన కామాక్షి పీఠంలో అమ్మవారికి పున్నమి సందర్భంగా బుధవారం ప్రత్యేక పుజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు లక్ష పసుపు కొమ్ముల నోములు, గడిసెడు ధాన్యం నోములు నోచుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో పీఠం నిర్వాహకులు వేదుల వేంకటరమణ శర్మ, శ్రీనివాసరావు, మోహిని తదితరులు పాల్గొన్నారు.

హైవేపై కారు బోల్తా



బోల్తా పడిన కారు

రణస్థలం: మండలంలోని పతివాడపాలెం సమీపంలో జాతీయ రహదారిపై శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానికులు సంఘటన స్థలానికి చేరుకుని కారులో ఉన్నవారికి సపర్యలు చేశారు. కారులో ఉన్నవారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

అపారిశుద్ధ్యం



అపారిశుద్ధ్యంగా ఉన్న సర్వీసు రోడ్డు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలో పాత జాతీయ రహదారి అనుకొని అపారిశుద్ధ్యం సమస్యగా మారుతోంది. అపారిశుద్ధ్యంతో పాటు బహిరంగ మల విసర్జన రోడ్డు పక్క ప్రధాన సమస్యగా మారుతోంది. వాహన చోదకులు సైతం ఇబ్బంది పడుతున్నారు. జనావాసాలకు సమీపంలో ఈ సమస్య కొనసాగుతోంది. ఈ పక్కనే ఆర్టీసీ సంస్థకు చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లు సైతం ఉన్నాయి.

రోడ్డు గోతులమయం



ఎచ్చెర్ల నుంచి కొయ్యాం వైపు వెళ్లే తారురోడ్డు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల నుంచి చినరావుపల్లి, సంతసీతారాంపురం, కొయ్యాం, బడివానిపేట వైపు వెళ్లే తారు రోడ్డు గోతులమయంగా మారింది. దీంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. నిరంతరం రద్దీగా ఉండే ఈ రోడ్డుపై రోజూ అధిక సంఖ్యలో వాహన చోదకులు రాకపోకలు సాధిస్తుంటారు. కనీసం గోతులు పూడ్చాలని విన్నవిస్తున్నారు.

నిరుపయోగంగా యంత్రం



మూలకు చేరిన ఇటుకల తయారీ యంత్రం

ఎచ్చెర్ల క్యాంపస్: గృహ నిర్మాణశాఖ ఆధ్వర్యంలో సిమెంట్ ఇటుకలు తయారు చేసే యంత్రం తుప్పు పడుతోంది. ఎచ్చెర్ల హౌసింగ్ కార్యాలయంలో ఇటుకలు తయారీ యంత్రాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. నిరుపయోగంగా పడి ఉన్న యంత్రాలు ఆక్షన్ వేసి అమ్మడం చేయాలి. కానీ అటువంటి చర్యలు తీసుకోకపోవడంతో తుప్పుపడుతున్నాయి.

నిర్లక్ష్యపు నీడలో..!

- అధ్వానంగా ఎల్‌బీఎస్ పార్కు
- విరిగిన బెంచీలు
- పాడైపోయిన వాకింగ్ ట్రాక్

శ్రీకాకుళం అర్బన్: నిత్యం ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కు నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతోంది. వర్షాలతో అస్తవ్యస్తమవ్వడంతో చర్యలు చేపట్టాలని కోరుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు నగరంలోని ఎల్‌బీఎస్ పార్కు ధ్వంసమైపోయింది. దీంతో ఆ పార్కు బాగు చేయాలని కాలనీ ప్రతినిధులు, యువత, స్థానికులు కోరుతున్నారు. శ్రీకాకుళం నగరంలోని ఎల్‌బీఎస్ కాలనీలో ఉన్న ఈ పార్కులో ఉన్న భారీ వృక్షం వర్షాల కారణంగా నేల కూలింది. విరిగిన వృక్షం పార్కులో ఉన్న షటిల్ కోర్టు, లైటింగ్ పోల్స్, సిమెంట్ బెంచీలపై పడిపోవడంతో అవి ధ్వంసమయ్యాయి.



ఎల్‌బీఎస్ పార్కులో కూలిన భారీ వృక్షం ఫైల్ (ఇన్‌సెట్‌లో) నామమాత్రంగా ఉన్న పార్కు స్టోర్ రూమ్ తలుపులు

అలాగే వర్షాల సమయంలో పార్కులో ఉన్న వాకింగ్ ట్రాక్ కూడా పూర్తిగా పాడైపోయింది. పార్కు కాంపౌండ్ వాల్ సైతం దెబ్బతింది. స్టోర్ రూమ్ తలుపులు కేవలం నామమాత్రంగానే ఉన్నాయి. దీనికోసం అధికారులు, ప్రజా ప్రతినిధులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి బాగు చేయాలని కోరుతున్నారు.



వృక్షం కూలిపోవడంతో పార్కు గోడపై ఫెన్సింగ్ విరిగిపోయిన దృశ్యం



భారీ వృక్షం ముక్కలు



వృక్షం కూలి విరిగిపోయిన కరెంట్ స్తంభం

40 ఏళ్ల క్రితం పార్కు



నగరంలో ఈ పార్కు ఏర్పాటు చేసి 40 ఏళ్లు దాటింది. ఈ పార్కుకు ఉదయం, సాయంత్రం వేళల్లో అధిక సంఖ్యలో వృద్ధులు, మహిళలు వాకింగ్, యోగా వంటివి చేయడానికి వస్తుంటారు. చెట్టు కూలిపోవడంతో వాకింగ్ ట్రాక్ పాడైపోయింది. ఈ పార్కును తక్షణమే బాగు చేయాలని మున్సిపల్ అధికారులను కోరుతున్నాం.

– ద్వారపు అజిత్‌కుమార్, ఎల్‌బీఎస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు

లైటింగ్ లేకపోవడంతో ఇబ్బందులు



పార్కులో లైటింగ్ లేకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు, మందు బాబులకు అడ్డాగా మారుతోంది. దీంతో స్థానిక యువత గమనించి వారు రాకుండా అడ్డుకట్ట వేయడం జరిగింది. మూడు నెలల క్రితం భారీ వృక్షం కూలిపోతే మున్సిపల్ అధికారులు ఇప్పటి వరకు పట్టించుకోలేదు. కొమ్మలను కోసి పక్కకు వేశాం. వీటిని ఇప్పటికైనా తొలగించాలి.

– కాశిన ప్రసాదరావు, ఎల్‌బీఎస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి

నిర్వహణపై దృష్టి సారించాలి



పార్కు నిర్వహణపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలి. ఇందులో వాకింగ్ ట్రాక్ స్థానికులంతా కలిసి చందాలు వేసుకుని నిర్మించుకున్నాం. అలాగే యువత షటిల్ ఆడుకునేందుకు కూడా కోర్టు నిర్మించుకున్నాం. పార్కు నిర్వహణ ఉంటే మరింత ఆహ్లాదకరంగా ఉంటుంది. మున్సిపల్ యంత్రాంగం ఆ దిశగా ఆలోచన చేయాలని స్థానికులమంతా కోరుతున్నాం.

– బి.వి.జి.మురళీకృష్ణ, ఎల్‌బీఎస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి

కష్టాల సాగు..!



పొట్ట దశలో ఉన్న వరిపంట



నీటికోసం రాత్రి సమయంలో పొలాల్లో నిద్రిస్తున్న రైతన్న



మడ్డువలస కాలువలో నీరు లేని వైనం

పంట చేతికి వస్తున్న సమయంలో నీరు అందక అన్నదాత కన్నీరు పెడుతున్నాడు. మడ్డువలస ప్రధాన కాలువ ద్వారా సాగునీరు అందకపోవడంతో ఆవేదన చేస్తున్నారు. మడ్డువలస కాలువ ద్వారా సుమారుగా 7 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. కానీ వాండ్రంగి, ఆనందపురం, సంతవురిటి, దవళపేటపెంట, సీతంపేట, టీడీవలస, పాలఖండ్యాం, మెట్టవలస, నిద్దాం, గ్రామాలకు ఖరీఫ్ ప్రారంభమయ్యాక ఇంతవరకు కాలువ ద్వారా నీరు రాలేదు. గతంలో కురిసిన వర్షాలకు నాట్లు వేశారు. కానీ సుమారు రెండు నెలలుగా వర్షాల జాడ లేకపోవడంతో సాగునీటి కోసం నానా పాట్లు పడుతున్నారు.

– జి.సిగడాం

డిసెంబర్ 14న లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: డిసెంబర్ 14న జరగనున్న లోక్ అదాలత్‌లో ఎక్కువగా క్రిమినల్ కేసులు పరిష్కారమయ్యేలా చొరవ తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. బుధవారం జిల్లా కోర్టు భవనంలో పోలీసు అధికారులు, ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులపై దృష్టి సారించాలన్నారు. జైల్లో ముద్దాయిలకు 'నల్సా' అందిస్తున్న సేవలను వివరించాలన్నారు. సమావేశంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి, న్యాయమూర్తులు పి.భాస్కరరావు, ఎస్ఎం ఫణికుమార్, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, కె.ఎల్.వి.హిమబిందు, పబ్లిక్ ప్రాసెక్యూటర్లు చింతాడ సత్యనారాయణ, నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే



శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వెళ్లే ప్రధాన మార్గం కొత్తరోడ్డు తర్వాత భాష్యం స్కూల్ జంక్షన్ వద్ద గోతులమయమై ఉంది. ఇటు పాలకులు, అటు అధికారులు నిరంతరం ఈ మార్గం గుండానే వెళ్తున్నా పట్టించుకోవడం లేదు. ఎవరైనా ఆదమరిస్తే అక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి.

– శ్రీకాకుళం పాత బస్టాండ్

శ్రీచక్ర మేరువుకు పూజలు



బలగ నాగావళి తీరంలో ఉన్న బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో గౌరీ పౌర్ణమి సందర్భంగా శ్రీచక్రరూపేన (మేరువు రూపంలో) సిరిజ్యోతికి పూజలు బుధవారం జరిగాయి. పీఠం నిర్వాహకులు గణేష్ గురుజీ ఆధ్వర్యంలో మహిళలు శ్రీచక్రానికి దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు.

– శ్రీకాకుళం కల్చరల్

కొనసాగుతున్న రద్దీ



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకూ ప్రయాణికులతో రద్దీగా కనిపించింది. దసరా పండగ అనంతరం దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు మరలా తిరుగు ప్రయాణం కావడంతో కాంప్లెక్స్ ప్రయాణికులతో రద్దీమయంగా కనిపించింది.

– శ్రీకాకుళం అర్బన్

ప్రైవేట్ షాపులకు మద్యం



ప్రభుత్వ మద్యం షాపులు మంగళవారం నుంచి నిలిపివేసిన విషయం తెలిసిందే. దీంతో కొత్తగా అనుమతులిచ్చిన ప్రైవేటు మద్యం షాపులకు బుధవారం నుంచి మద్యం సరఫరా ప్రారంభమైంది. ఎచ్చెర్ల ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ నుంచి మద్యం డెలివరీ చేశారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

దోమల బెడద



ఎచ్చెర్ల మండలంలోని పొన్నాడ పంచాయతీ బింగుపేట గ్రామంలో ప్రధాన వీధుల మధ్యలో కాలువ లేకపోవడంతో మురికినీరు నిత్యం నిల్వ అవుతోంది. దీంతో దోమలు, దుర్వాసనతో ప్రజలు రోగాల బారినపడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– ఎచ్చెర్ల

'జనాభాకు సరిపడా ఆహారం లేదు'



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రస్తుతం దేశంలో పెరుగుతున్న జనాభాకు తగిన ఆహారం లభించడం లేదని, తక్షణమే ప్రభుత్వాలు మేల్కొకుంటే భవిష్యత్ తరాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తుందని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్ర తెలిపారు. బుధవారం కళాశాల అర్థశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రస్తుతం వ్యవసాయం చేసేవారి సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోందని, జనాభా పెరుగుతున్నందుకు ఆహారం లభించడంలేదన్నారు. ఆహార భద్రతను పాటించాలని, ఆహారాన్ని వృథా చేయరాదని సూచించారు. ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి టి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఆకలితో చచ్చిపోతున్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తుండడం కలిచి వేస్తోందన్నారు. ఈ సంవత్సర నినాదం మెరుగైన జీవితం, మంచి భవిష్యత్తు కోసం ఆహార హక్కు అని ఆమె గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ కో–ఆర్డినేటర్ చింతాడ కృష్ణారావు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, డాక్టర్ చిన్నారావు, ఎకనామిక్స్ లెక్చరర్ డాక్టర్ బి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వ్యవస్థాపక దినోత్సవం



మాట్లాడుతున్న ఎంవీఎస్ శర్మ

శ్రీకాకుళం అర్బన్: బ్యాంకు ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 43వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి శ్రీకాకుళంలోని ఎంజీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా వ్యవహరించిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థలని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను వివరించి, వాటికి పరిష్కారం దిశగా ఐక్య పోరాటాలు సాగించాలని ట్రేడ్ యూనియన్ రంగాలకు సూచించారు. యూఎఫ్‌బీయూను వ్యవస్థాపించడంలో బీఈఎఫ్ఐ(బెఫి) పాత్రని వివరించారు. బ్యాంకింగ్ రంగ ప్రస్థానం, అందులో ట్రేడ్ యూనియన్ పాత్ర గురించి వివరిస్తూ సంఘటిత పోరాటాల్లో అందరూ మమేకమై ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఏఐబీఈఏ నాయకురాలు శ్రావణి, శ్రామిక మహిళా కన్వీనర్ నాగమణి, పోస్టల్ నాయకులు కె.గణపతి మహిళల సమస్యలపై మాట్లాడారు. అంతకుముందు సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ నాయకులు బీవీఎస్ రావు, కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

రణస్థలం:

జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఇడదాసుల విద్యా ఆరోగ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వారిచే నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు ఇడదాసుల వెంకట సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని సూర్య ఆస్పత్రి ఆవరణలో ఉచిత వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా 110 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, వారిలో 32 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించి విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్‌కు తరలించారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు, కళ్లద్దాలు సూచించారు. అలాగే పలు గుండె జబ్బులు, బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు యశ్వంత్, ఫణి తేజ, ఫౌండేషన్ అధ్యక్షుడు తిరుపతి రాజు, శంకర్ ఫౌండేషన్ సిబ్బంది, పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో మౌలిక వసతులు

ఎచ్చెర్ల క్యాంపస్: అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యమని ఎచ్చెర్ల ఐడీడీఎస్ పీవో డి.పాపినాయుడు తెలిపారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని అంగన్‌వాడీ సిబ్బందితో మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పూర్తిస్థాయిలో సొంత భవనాల ఏర్పాటు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వివరించారు. నిబంధనలు మేరకు పౌష్టికాహారం అందజేత, పూర్వపు ప్రాథమిక విద్య అందించడం లక్ష్యంగా తెలిపారు. ఎచ్చెర్ల మండల ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు రీసోర్సు పర్సన్ సువ్వారి సన్యాసిరావు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఖాళీ స్థలాల్లో కిచెన్ గార్డెన్లు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఆధార్ సేవలు



అధార్ సేవలు అందజేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ రాము

జి.సిగడాం: స్థానిక సచివాలయంలోని ఆధార్ కేంద్రంలో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి తులసీ ప్రసాద్ సాహు ఆధ్వర్యంలో బుధవారం డిజిటల్ అసిస్టెంట్ పొగిరి రాము వికలాంగులు, వృద్ధులు, చిన్నారులకు ప్రత్యేక శ్రద్ధ వహించి ఆధార్ కార్డులో చేర్పులు, మార్పులు చేస్తున్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న యూనియన్ బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫొటోగ్రఫీ, వీడియో గ్రఫీ, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌ల్లో 30 రోజులు ఉచిత శిక్షణ, వసతి, భోజనం కల్పించనున్నట్లు వివరించారు. ఈనెల 31లోపు దరఖాస్తులు చేసుకోవాలని, నవంబర్ 1వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 95534 10809, 77021 80537 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మున్సిపల్ ఉపాధ్యాయులకు అవకాశం ఇవ్వాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఎస్‌సీఈఆర్‌టీలో డిప్యూటేషన్ ప్రాతిపదికన అధ్యాపక పోస్టుల భర్తీ కోసం పాఠశాల విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే వీటికి మున్సిపల్ ఉపాధ్యాయులకు కూడా అవకాశం కల్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబురావు, బి.శ్రీరామ్‌మూర్తి బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌సీఈఆర్‌టీలో డిప్యూటేషన్ పోస్టులకు ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్య ఉపాధ్యాయులు మాత్రమే అర్హులని చెప్పటం సరికాదన్నారు. అర్హత కలిగిన మున్సిపల్ ఉపాధ్యాయులకు కూడా ఈ పోస్టులు దరఖాస్తు చేసుకోవడానికి అనుమతించాలని కోరారు. 010 హెడ్ కింద మున్సిపల్ టీచర్లు జీతాలు తీసుకునేవారేనని ఒక వైపు చెప్తూనే, మరొకవైపు వారికి ఈ పోస్టులకు దరఖాస్తు చేసేందుకు మినహాయించడం సరికాదని, తక్షణమే సవరణ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు.

నాణ్యతకు తిలోదకాలు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డు పనులకు వేసిన మట్టి

రణస్థలం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎన్‌హెచ్–16 నుంచి వెళ్లే రహదారికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.33.70 లక్షలు కేటాయించి సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారు. అయితే ఈ నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇచ్చేశారు. వ్యర్థ మట్టి(కాలువ వ్యర్థాలు కలిగిన మట్టి)తో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో వ్యర్థ మట్టితో రోడ్డు నిర్మాణ పనులు చేయడమేంటని రెవెన్యూ అధికారులే చర్చించుకుంటున్నారు. దీనిపై మండల తహసీల్దార్ ఎస్.ప్రసాద్‌కు వివరణ కోరగా పంచాయతీరాజ్ జేఈతో మాట్లాడి సరియైన గ్రావెల్ వేయించేలా చూస్తామని తెలిపారు

ఉపాధి పనులు నిర్వహించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రస్తుతం గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు కాలానుగుణంగా నిర్వహించాలని ఎచ్చెర్ల ఎంపీడీవో సీపాన హరిహరరావు అన్నారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 100 రోజులు పని లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. మార్చి నుంచి వ్యక్తిగత పనులు నిర్వహించే అవకాశం ఉందని, అంతవరకు నిబంధనలకు లోబడి పనులు చేయాలని సూచించారు. తోటలు పెంపకం, కందకాలు తవ్వకం, నీటి నిల్వ గుంతలు తవ్వకం వంటివి చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామంలో నిర్దేశించిన ప్రణాళిక, లక్ష్యాల మేరకు పనులు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో శోభాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.